క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీల బహూకరణ

ఉంగుటూరు: తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తమ వంతు సాయం చేయడం అభినందనీయమని ఎంఈఓ-2 సాంబశివ రావు అన్నారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.12వేలు విలువగల కుర్చీలు పాఠశాలకు బహూకరించారు. ఎంఈఓ-2 జె.సాంబశివరావు చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం అనితకు కుర్చీలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ మాజీ చైర్మన్ ఉద్దగిరి శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు కంతేటి రాజు, దేవరకొండ సాంబశివరావు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

పెనమలూరు: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. కాలేజీలో శుక్రవారం ఫ్రెషర్స్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కాలేజీలో సీనియర్, జూనియర్ విద్యార్థులు కలిసి అభిప్రాయాలు పంచుకొని విజయం సాధించాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. అలాగే జూనియర్ విద్యార్థులు సీనియర్స్ వద్ద అనుభవాలు తెలుసుకోవాలన్నారు.

వ్యాపారులు భద్రత పాటించాలి

పెనమలూరు: బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యాపారులు భద్రతను పాటించాలని ఆర్డీఓ డి.రాజు తెలిపారు. ఆయన శుక్రవారం కానూరు, పెనమలూరులో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బాణసంచా దుకాణాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ వెంకటశివయ్య పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ రహిత నీరు మాత్రమే తాగాలి

పెనమలూరు: ఫ్లోరైడ్ లేని తాగునీరు మాత్రమే తాగాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ బద్రీనాథ్ అన్నారు. తాడిగడప జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోరైడ్‌లేని నీరు తాగడం వలన ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. ఫ్లోరైడ్ నీరు తాగితే అనారోగ్యానికి గురవ్వడమే కాకుండా ప్రాణానికి హాని ఉంటుందని తెలిపారు. మండల వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఫ్లోరోసిస్ సర్వే చేసి బాధితులకు విటమిన్ సీ ట్యాబ్లెట్లు పంపిణీ చేశామన్నారు.

ఆకట్టుకున్న అకడమిక్ ఎక్స్‌పో



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీపబ్లిక్ స్కూల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ రాజాశీలన్ మురుగయన్ హాజరై వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో విద్యార్థులు తమ మేధో సంపత్తితో తయారు చేసి ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. ము ఖ్యంగా కాబూలీ వాలా, మైమ్ షో, సోషల్ ఇష్యూ స్, జర్నీ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్, పొడుపు కథలు, అక్షరం మారితే అర్థం మార్పు, రామాయణం, మహాభారతం ప్రాముఖ్యత, సంప్రదాయ నృత్యాలు, క్రాఫ్ట్‌లో ఉడెన్ డస్ట్ ఆర్ట్, ఆర్ట్ విభాగంలో క్లాత్ పెయింటింగ్, సైన్స్ విభాగంలో ఎనర్జీ కాంగ్రుగేషన్, రోడ్ సేఫ్టీ, మానవ హృదయ స్పందన వంటి నమూనాలు ఆలోజింపచేశాయి.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీయవచ్చు

ఇలాంటి బాషా వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చునని రాజాశీలన్ మురుగయన్ అన్నారు. అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, డైరెక్టర్ పవన్ చంద్, కె. ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



ఉంగుటూరు: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తోందని నూరూ బాషా, దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు పులిమర్తి చిన్న మస్తాన్ పేర్కొన్నారు. మండలంలోని ఉంగుటూరులో నూర్ బాషా, దూదేకుల ముస్లింల ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథి చిన్న మస్తాన్ మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి ఉంగుటూరులో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సహకారంతో దర్గా నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జెండాల ఊరేగింపు నిర్వహించి, అన్నదానం చేశారు. అనంతరం చిన్న మస్తాన్‌ను మసీదు కమిటీ సంఘ పెద్దలు సత్కరించారు. ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రసూల్, రహీం, షేక్ ఇస్సాక్, మసీద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ వలీ, షేక్ రాజా, వసంత పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేదల జీవన స్థితిగతులు మార్చడమే అసలైన అభివృద్ధిగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం కానుమోలులోని సచివాలయం ప్రాంగణంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ ఎనికేపల్లి శాంతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతుందని దళారీ వ్యవస్థ లేకుండా నిస్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేసిన ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారని వివరించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. పెరికీడులో గడిచిన నాలుగున్నర ఏళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా వివిధ పథకాల లబ్ధిదారులకు రూ.17.24 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా మరో రూ.5.59 కోట్ల మేర నగదు పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ పందు రాణి, ఎంపీటీసీ సభ్యురాలు కాటుమాల ఇంద్రజ, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడకల వీర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి ఉమా, ఎనికేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్నను నమ్మితేనే న్యాయం

పెనమలూరు: జగనన్నను నమ్మితేనే ప్రజలకు పూర్తి న్యాయం జరుగుతుందని వణుకూరు గ్రామ సర్పంచ్ చక్క విజయ అన్నారు. గ్రామంలోని ఒకటో సచివాలయంలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. తొలుత గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో ఉన్న బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతా శర్మ, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, గోసాల సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు, నాయకులు గద్దల రాజా, వల్లే నరసింహారావు, వేమూరి రాజా, చక్క గోపీకృష్ణ, వణుకూరు కోటయ్య పాల్గొన్నారు.



కానుమోలులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాంధీ

ఉయ్యూరు, చిన ఓగిరాలలో..

ఉయ్యూరు: పట్టణంలోని 4, 5 వార్డు సచివాలయాల పరిధిలో శ్రీలంక కాలనీ-2లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైద్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి, కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంట్రప్రగడ బాబ్జీ, కౌన్సిలర్లు గోన మదన్, బేగ్, రాజులపాటి చిన్ని, గుంజా సుధాకర్, ఐదో వార్డు ఇన్‌చార్జి దిరిశం జ్యోతిర్మయి, అహ్మద్‌ఖాన్, వణుకూరు సురేష్ తదితరులు సచివాలయాన్ని సందర్శించారు. సంక్షేమం, అభివృద్ధి పనులపై చర్చించి రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే పోస్టరును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసే రవి, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, నాయకులు మంచిగంటి రమేష్ పాల్గొన్నారు.



వణుకూరులో అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాల బోర్డు ఆవిష్కరణ



గన్నవరంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

కులమతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

గన్నవరం: దేశ చరిత్రలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ ఫలాలను అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక పాతగన్నవరంలోని గ్రామసచివాలయం-3లో సర్పంచ్ నిడమర్తి సౌజన్య అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ఎంపీపీ, సర్పంచ్, ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని ఆవిష్కరించారు. అనంతరం కొత్తపేట వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ ఎగురవేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ సుందరరావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, సచివాలయ కన్వీనర్లు రామ్మోహన్‌రావు, కాసరనేని అజయ్, ఉమావతి పాల్గొన్నారు.

ఎక్కడికక్కడే ప్రజా సమస్యల పరిష్కారం

- కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు
- కంకిపాడులో జగనన్నకు చెబుదాం నిర్వహణ

కంకిపాడు(పెనమలూరు): ఎక్కడికక్కడ ప్రజా సమస్యలు పరిష్కరించడమే జగనన్నకు చెబుదాం లక్ష్యమని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. కంకిపాడు పట్టణంలోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో కలిసి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖల అధికారులతో నేరుగా మాట్లాడి పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకునేలా మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం దొరకలేదని భావిస్తే జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే స్పందనను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులే క్షేత్రస్థాయికి వెళ్తుండటంతో ప్రజల్లో సంతృప్తికర స్థాయి పెరుగుతుందన్నారు. కంకిపాడు వేదికలో 106 అర్జీలు అందాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

చక్కని వేదిక

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారం కోసం చక్కని వేదిక అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను అధికారులు ఎంతో బాధ్యతతో నిర్వహిస్తే సమస్యలు ఉండవని, ప్రజలు సంతోషంగా ఉంటారని పేర్కొన్నారు. సచివాలయాల్లో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులు సమస్య అర్థం కాకపోతే, ఉన్నతాధికారులకు సమస్య వివరించాలని సూచించారు.



దివ్యాంగుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

రహదారుల అభివృద్ధికి రూ. 70 లక్షలు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న మూడు ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.70 లక్షలు నిధులు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. మూర్తిరాజుగూడెం, కోమటిగుంట-తెన్నేరు, కోలవెన్ను రోడ్డుకు ఈ నిధులను వెచ్చిస్తామన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'మాతృత్వం ఓ వరం-దత్తత మరో మార్గం' పేరుతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కొణతనపాడు గ్రామంలో భూ సర్వే పూర్తయిన నేపథ్యంలో రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ జలకళ కింద రూ. 2.63 లక్షల విలువైన సబ్‌మెర్సిబుల్ బోర్లను నలుగురు రైతులకు అందించారు.

కలెక్టర్‌కు సత్కారం

అనంతరం మార్కెట్‌యార్డు కార్యాలయాన్ని కలెక్టర్ పి.రాజాబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ నానావత్తు చిన్ని, యార్డు సిబ్బంది కలెక్టర్ పి.రాజాబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్ఓ పెద్ది రోజా, సీఈఓ జ్యోతిబసు, ఆర్డీఓ రాజు, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఎస్ఓ పార్వతి, డీఈఓ తాహెరా సుల్తానా, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి), ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు గొప్ప వరమని జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు సచివాలయం-2 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె, చర్మ, దంత, కంటి వ్యాధులతో పాటు సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులకు సుమారు 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ అంజనీకుమారి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు రత్నం, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, వార్డు సభ్యుడు రవికుమార్ పాల్గొన్నారు.



ప్రసాదంపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

303 పనుల గుర్తింపు

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి ప్రణాళిక పనుల గుర్తింపు గ్రామ సభలు శుక్రవారం నిర్వహించారు. వేంపాడు, ఉంగుటూరు, తేలప్రోలు, తుట్టగుంట గ్రామాల్లో గ్రామ సభలు ద్వారా 303 పనులు గుర్తించారని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. ఈ గ్రామ సభల్లో సర్పంచ్‌లు కె.వరప్రసాద్, ఎస్.శివ నాగరాజు, లాం దిబోర, బి.రామకృష్ణారెడ్డి, ఎస్ఆర్‌జీఎస్ ఏపీఓ వినీల పాల్గొన్నారు.

ముగ్గురిపై బైండోవర్ కేసు

పెనమలూరు: బాణసంచా అక్రమంగా ఉంచారని ముగ్గురు వ్యక్తులపై పోలీసులు శుక్రవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు యనమలకుదురు గ్రామానికి చెందిన పొన్నూరు ఉమామహేశ్వరరావు, మద్ది పుల్లయ్య, మద్ది శివ అక్రమంగా బాణసంచా తమ వద్ద దుంచుకోవడంతో పోలీసులు పై ముగ్గురు వ్యక్తుల పై బైండోవర్ కేసు నమోదు చేశారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయంతో పాటు అనుబంధ విభాగాల్లో పథకాలు అమలుపై సమీక్షించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఖరీఫ్ ధాన్యాన్ని ఆర్బీకేలు ద్వారా కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులకు అవసరమైన గోనె సంచులను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు రాయితీపై ఆయిల్ ఇంజిన్లు, తైవాన్ పంప్స్, టార్పాలిన్స్ పంపిణీ చేయాలని సలహా మండలి చైర్మన్ కాసరనేని గోపాలరావు కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, మండలి సభ్యులు ఏ. శ్రీనివాసరెడ్డి, జంపన బుజ్జి, మండల వ్యవసాయ అధికారి ఎస్ఎల్. తేజస్వి, ఎలక్ట్రికల్ ఏఈ ఎం.వెంకటరాజు, ఆర్ఐ టి.ఉదయ్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి హరిచంద్ పాల్గొన్నారు.

ఒకే ఈతలో కవల దూడల జననం

గన్నవరం రూరల్: గన్నవరం మండలం జక్కులనెక్కలంలో శుక్రవారం ఉదయం చూడి గేదె రెండు పెయ్య దూడలకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన కొలుసు రామలక్ష్మణుడు పాడి పెంపకంపై ఆధారపడి జీవించే రైతు. రామలక్ష్మణుడు ఇంటిలో శుక్రవారం ఓ గేదె రెండు పెయ్య దూడలకు 8వ ఈతగా జన్మనిచ్చింది. ఈ విషయంపై అల్లాపురం వెటర్నరీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కాట్రగడ్డ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ దీనిని మోనో జైగోటిక్ ట్విన్స్‌గా చెబుతారని తెలిపారు. లక్ష పశువుల్లో ఒక్కసారి ఇలా పుడతాయని పేర్కొన్నారు. ఒక పిండం తయారు అయ్యి అది రెండుగా విడిపోయి రెండు పిండాలుగా ఎదుగుతుందన్నారు. అలా కాకుండా ఒక అండం బదులుగా రెండు అండాలు విడుదలై రెండు వీర్యకణాలతో ఫలదీకరణం చెంది రెండు పిండాలుగా ఎదుగుతాయని దీనిని డైజైగోటిక్ ట్విన్స్‌గా పిలుస్తామని తెలిపారు. పశువైద్య సేవలు అందజేసిన సావరగూడెం యానిమల్స్ హజ్బెండరీ అసిస్టెంట్ మెగావత్ రాంబాయిని ఏడీఏ రాధాకృష్ణమూర్తి, ముస్తాబాద పశు చికిత్సా కేంద్రం డాక్టర్ మేరీ వైడూర్యం, సర్పంచ్ మాకుల చిరంజీవి, అధికారులు, సిబ్బంది అభినందించారు.



రెండు పెయ్య దూడలకు జన్మనిచ్చిన గేదెతో రైతు రామలక్ష్మణుడు, ఏహెచ్ఏ రాంబాయి

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు పంచాయతీలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం శుక్రవారం ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ అండ్ ఇండియా టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో సర్పంచ్ మొవ్వా వెంకట నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ మొవ్వా జ్ఞానశేఖర్, సంస్థ ప్రతినిధు లు రాకేష్, ప్రత్యూష, దేవి పాల్గొన్నారు. ఎయిడ్స్ నియంత్రణ, నివారణా చర్యలను వివరించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి

కంకిపాడు: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు ప్రాంగణంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల చైర్మన్ చాట్ల విజయ్‌బాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను మండలాల వారీగా తరలించామన్నారు. ఈ క్రాప్, ఈ కేవైసీ పూర్తయిన రైతుల నుంచి సమర్థంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండల చైర్మన్ చాట్ల విజయ్‌బాబు మాట్లాడుతూ రైతులు పండించిన పంటనంతా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఏడీఏ స్వర్ణలత, తహసీల్దార్ ప్రసాద్, డైరెక్టర్ నకరికంటి శేఖర్, ఏఓ పీఎం కిరణ్ పాల్గొన్నారు.



ఈ క్రాప్ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి

రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యం

నున్న(విజయవాడరూరల్): రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని విజయవాడ వ్యవసాయ అసిస్టెంటు డైరెక్టర్ బి. వెంకటేశ్వరావు అన్నారు. నున్న గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ధాన్యం విక్రయాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ధాన్యం మిల్లులకు రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ అమర్చాల్సి ఉంటుందన్నారు. తేమశాతం 17 శాతం మాత్రమే అంగీకరించబడుతుందని తెలియజేశారు. మండలంలో శనివారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్ బాబు, సొసైటీ చైర్మన్ పోలారెడ్డి ప్రభాకరరెడ్డి, వెటర్నరీ అసిస్టెంటు ప్రసన్న, ఉద్యానశాఖాధికారి పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో శనివారం నుంచి ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ క్వాలిటీ మేనేజర్ ఎం.జయప్రద పేర్కొన్నారు. రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచనలను విధిగా పాటిస్తూ రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గ్రామాల్లో ముందుగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలు ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఒక వేళ రైతులు చెల్లించినట్టయితే ప్రభుత్వం తిరిగి రైతుల ఖాతాల్లోకి జమ చేస్తుందని తెలిపారు. ఏ గ్రేడు ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203లు, సాధారణ రకం రూ.2,183 రూపాయల చొప్పున రైతులకు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం అమ్మిన ప్రతి రైతు నుంచి బయోమెట్రిక్‌ను తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. మిల్లులకు రవాణా చేసే వాహనానికి తప్పనిసరిగా జీపీఎస్ అమర్చి ఉండాలన్నారు. ప్రభుత్వం కోఆపరేటివ్ సొసైటీలు, రైతుభరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. తేమ 17 శాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, అంతకుమించి ఉన్నట్టయితే ఆరబెట్టుకోవాలన్నారు. సమావేశంలో విజయవాడ వ్యవసాయశాఖ అసిస్టెంటు డైరెక్టర్ బి.వెంకటేశ్వరావు, రూరల్ మండల తహసీల్దారు కె.లక్ష్మీ, మండల వ్యవసాయాధికారి బి.రంగనాథబాబు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కంకిపాడు: క్రమశిక్షణతో కూడిన విద్యానభ్యసించాలని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో శుక్రవారం ఆమె మాట్లాడారు. రాయడం, చదవడం లో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. స్కిల్స్ ని పరీక్షించి ఇంకా చదవడం రాయడంలో మెరుగుపరుచుకోవాలని విద్యార్థులకు సూచనలు చేశారు. వారికి త్వరలో జరిగే ఎస్ఏ-1 పరీక్షల గురించి వివరించారు. అనంతరం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో విద్యార్థుల ప్రగతిని ప్రధానోపాధ్యాయులతో చర్చించి సూచనలు ఇచ్చారు. ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

15న మండల పరిషత్ సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్యకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలలో తెలిపారు. ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సంక్షేమ పథకాలు అమలు, ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మనుషుల అక్రమ రవాణా నివారణపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: మనుషుల అక్రమ రవాణా నిరోధించడం అందరి బాధ్యత అని వైఎస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ భూపతిరావు అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంధ సంస్థ, మండల మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై డ్వాక్రా మహిళలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన సదస్సులో ఏపీఎం భూపతిరావు మాట్లాడుతూ ఉద్యోగం, విదేశీ ఉపాధి, సినిమా అవకాశాలు అందజేస్తామని నమ్మించి అధికంగా యువతులను అక్రమ రవాణా చేస్తున్నారని తెలిపారు. ప్రజ్వల స్వచ్ఛంధ సేవా సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ నేటి యువత అధికంగా సైబర్ ట్రాఫికింగ్‌కు గురి అవుతున్నారని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు, మేసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రజ్వల కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శివ, సీసీలు విమల, అమ్మాజీ, కమల, శాంతి పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ఉల్లంఘనకు పాల్పడిన సేల్స్‌మ్యాన్‌పై చర్యలు

గన్నవరం: స్థానిక మర్లపాలెం రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీ కంటే అదనంగా మద్యం విక్రయిస్తున్న సేల్స్‌మ్యాన్ జి.పొన్నగిరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ విజిలెన్స్ సీఐ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు ఎక్సైజ్ విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దారుహౌస్ విస్కీ 180 ఎంఎల్ బాటిల్ గరిష్ట చిల్లర ధర రూ. 150 కంటే రూ. 10 ఎక్కువగా విక్రయిస్తుండడంతో సెల్స్‌మ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ సుబ్బారెడ్డి, హరి, కానిస్టేబుల్ మోహన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: మండలంలోని గన్నవరం, కేసరపల్లి సబ్‌స్టేషన్ల నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు తెలిపారు. మర్లపాలెం, చిన్నఆవుటపల్లి, దావాజిగూడెం, అల్లాపురం, రాజీవ్‌కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, బీబీ.గూడెం, గొల్లనపల్లి, చిక్కవరం, కేసరపల్లి, ఎస్ఎల్వీ విల్లాస్, అప్పారావు పేట, అజ్జంపూడి, బుద్ధవరం, బూతిమిల్లిపాడు, వీఎస్. పురం, జక్కులనెక్కలం జగనన్న కాలనీలో పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రతిభావంతురాలైన పేద విద్యార్థినికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేయూతను అందించింది. స్థానిక గుడివాడరోడ్డుకు చెందిన నూకల యవనిక కానూరులోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి మరణించటంతో తల్లి తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తూ కుమార్తెను చదివిస్తుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న యవనిక మానవత సంస్థను ఆశ్రయించడంతో రూ.10 వేలు సాయాన్ని అందించారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో యవనిక తల్లి సుజాతకు రూ.10 వేలను శుక్రవారం మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదగా పంపిణీ చేశారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు కూరెళ్ల సుబ్బాచారి, ప్రధాన కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, కోశాధికారి ప్రాబోలు గణేష్, సీనియర్ సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, పొట్లూరి శేషాచలం పాల్గొన్నారు.

ఉచితంగా 100 మందికి వైద్య పరీక్షలు

రామవరప్పాడు: శైవక్షేత్ర పీఠాధిపతులు, హిందూ ధర్మ పరిరక్షకులు శివస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో శుక్రవారం వాసవీ పరివార్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రాఫా ల్యాబ్ సహకారంతో సుమారు 100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వాసవీ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పేరంటాలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు శిఖాకొల్లి యలమందయ్య, సంఘ అధ్యక్షుడు మాదాల వెంకట రమేష్, ఉపాధ్యక్షులు కోటా రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కంకిపాడు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మండవ శ్రీనివాస్, కార్యదర్శి పీకా ఇమ్మనుయేలు అన్నారు. (ఎస్టీయూ) రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కంకిపాడు మండలంలోని క్రిస్టియన్ పేట జగన్నాథపురం తెన్నేరు మంతెన ఉప్పులూరు వేల్పూరు ఈడుపుగల్లు, తదితర గ్రామాల్లో సభ్యత్వ నమోదు ప్రచార కార్యక్రమం నిర్వహించింది.

'ఆడుదాం ఆంధ్ర'ను చిత్తశుద్ధితో నిర్వహించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాలని బాపులపాడు ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్ పేర్కొన్నారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల విద్యా వనరుల కేంద్రంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణపై గ్రామ సచివాలయం అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను నిర్వహించాలని చెప్పారు. క్రీడాపోటీల నిర్వహణపై వ్యాయామోపాధ్యాయులు ఆయా గ్రామ వలంటీర్లకు తర్ఫీదు ఇవ్వనున్నారని తెలిపారు. మండల క్రీడల కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయుడు బీఎస్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.